సాక్షి
జోగులాంబ గద్వాల
బుధవారం । 18 । జూన్ । 2025



అక్రమ నిర్మాణాలు తొలగిస్తాం

ఆలయ భూముల్లో అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని అధికారులు చెప్పారు.

వివరాలు 8లో ▸



యూపీఐ సేవలు

యూపీఐ సేవలను అందుబాటులోకి తెస్తామని డీసీసీబీ చైర్మన్ అన్నారు.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
35.0 /22.6

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. అడపాదడపా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జోగులాంబ సన్నిధిలో డిప్యూటీ సీఎం సతీమణి



అలంపూర్: దక్షిణ కాశీ అలంపూర్ క్షేత్ర ఆలయాలను రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. బాలబ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు.

అంధ విద్యార్థులకు ప్రవేశాలు

గద్వాల: 2025–26 సంవత్సరానికి గాను రాష్ట్ర వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ వ్యక్తుల సాధికారిక శాఖ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లో నడపబడుతున్న ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల, కళాశాలలో 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు అంధులైన విద్యార్థినీ విద్యార్థుల ప్రవేశాల కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అంధుల ఆశ్రమ పాఠశాల కళాశాల ప్రిన్సిపల్ రాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాఠశాలలో చదువుకునే అంధులైన విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత భోజనం, 4 జతల దుస్తులు ప్రభుత్వం అందజేస్తుందని, అవసరమైన ఇతర అన్ని వసతులు ఉచితంగా కల్పిస్తామని తెలిపారు. అడ్మిషన్లకుగాను మహబూబ్‌నగర్ పిల్లలమర్రి రోడ్డులోని అంధుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్ సెల్ నం.9618243794 ద్వారా సంప్రదించాలని కోరారు.

పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

గద్వాల: గ్రామీణ ప్రాంతాల స్వయం సహాయక బృందాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని.. ఆ ఉద్దేశ్యంతోనే గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కరోజు ర్యాంపు అవగాహన సదస్సును నిర్వహించినట్లు జిల్లా ఇండస్ట్రీస్ సెంటర్ జనరల్ మేనేజర్ రామలింగేశ్వర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మహిళా సమాఖ్య కార్యాలయంలో అవగాహన సదస్సును ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక శాఖ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ మరియు పేదరిక నిర్మూలన సంస్థతో కలిసి అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. మహిళలకు 15 రోజుల పాటు పరిశ్రమ నిర్వహణ, ఉత్పత్తుల మార్కెటింగ్‌పై నైపుణ్యాభివృద్ధి, ఆచరణీయ పరిశ్రమ రిజిస్ట్రేషన్, బ్యాంకుల ద్వారా రుణ సహాయం ఇప్పించడం జరుగుతుందని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



గద్వాలటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని, ఉపాధ్యాయులపై నమ్మకం ఉంచి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆర్‌జేడీ విజయలక్ష్మి సూచించారు. స్థానిక పీజేపీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులలోని విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థికి రాయడం, చదవడం తప్పనిసరిగా రావాలని సూచించారు. అనంతరం బడిబాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల చేత సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లాలోని విద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గతేడాది పదో తరగతి ఫలితాలల్లో జిల్లా మెరుగైన ఫలితాలు సాధించిందని, అదే స్ఫూర్తితో మరింత మెరుగైన ఫలితాలను సాధించాలని సూచించారు. బడీడు పిల్లందరూ ప్రభుత్వ పాఠశాలలోనే ఉండాలన్నారు. ప్రైవేటు కంటే ప్రభుత్వ బడుల్లోనే అత్యధిక ఉత్తీర్ణత సాధిస్తున్నామనే విషయాన్ని పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి, పిల్లల తల్లిదండ్రులను భాగస్వామ్యం చేయాలన్నారు. ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు, బడిబాట కార్యక్రమాలు, విద్యార్థుల హాజరును ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్, సెక్టోరియల్ అధికారులు హంపయ్య, ఎస్తేర్‌రాణి, శాంతిరాజు తదితరులు పాల్గొన్నారు.

మన పాలమూరు ఫస్ట్..



ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధే నా లక్ష్యం..

- ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ముందుకు సాగుతా..
- అన్ని రంగాలు, అన్ని వర్గాల అభ్యున్నతికి పాటు పడతా..
- పక్కా ప్రణాళికతో బడుగు, బలహీన వర్గాలకు చేయూత..
- శక్తివంచన లేకుండా నా బాధ్యతలను నిర్వర్తిస్తా..
- 'సాక్షి'తో రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: 'పాలమూరు.. నాకు జన్మనిచ్చిన జిల్లా. మక్తల్ నుంచి ఇక్కడకు కాళ్లతో తిర్లాడిన.. సైకిల్‌పై తిర్లాడిన.. ఆ తర్వాత బండిపై తిర్లాడిన. ఇప్పుడు మంత్రిగా ఇక్కడికి రావడం చెప్పలేని ఆనందంగా ఉంది.' అని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి అభివృద్ధి, క్రీడా, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మంగళవారం ఆయన తొలిసారిగా మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రానికి వచ్చారు. ఈ సందర్భంగా 'సాక్షి' ఆయనతో ముచ్చటించగా.. పలు విషయాలు వెల్లడించారు. తన రాజకీయ జీవితం, పలు పరిణామాలతో పాటు 1991లో ఆదర్శ కళాశాలలో ఇంటర్ చదువుకునే రోజులను గుర్తు చేసుకున్నారు. వెనుకబడిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను అన్ని రంగాల్లో మొదటి స్థానంలో నిలిపేలా శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. మంత్రి ఇంకా ఏమన్నారో ఆయన మాటల్లోనే..

నమ్మకాన్ని నిలబెట్టుకుంటా..

ఇతర జిల్లాల్లో మంత్రి పదవులకు పోటీ ఉంది. కానీ ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన అందరు ఎమ్మెల్యేలు ముక్తకంఠంతో నన్ను మంత్రిగా చేయాలని కోరారు. పాలమూరు బిడ్డ అయిన సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కంకణం కట్టుకున్నారు. ముఖ్యమంత్రితో పాటు ఎమ్మెల్యేలు ఏ లక్ష్యంతోనైతే నాకు మంత్రిగా బాధ్యత కట్టబెట్టారో.. అందుకనుగుణంగా నా విధులు నిర్వర్తిస్తా. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాలమూరు అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషిచేస్తా.

పాడి, మత్స్య, క్రీడాభివృద్ధికి పక్కా ప్రణాళిక..

పాడి ఉత్పత్తులకు పాలమూరు పెట్టింది పేరు. పలు సమస్యలతో ఈ రంగం కుదేలైంది. అవసరాల మేర పాల ఉత్పత్తి జరిగేలా తగిన చర్యలు తీసుకుంటాం. ఉమ్మడి జిల్లాలో గేదెలు, ఆవుల పంపిణీతోపాటు షెడ్ల నిర్మాణం, దాణాను సబ్సిడీపై అందించేలా చూస్తాం. దీంతో పాటు గొల్లకురుమలకు గొర్రెల పంపిణీపై కసరత్తు చేస్తాం. మహబూబ్‌నగర్‌లో ఉన్న దక్కన్ జాతి గొర్రెల పరిశోధన కేంద్రంలో తగిన వసతులు కల్పిస్తాం. మత్స్యకారుల అభ్యున్నతిలో భాగంగా నాణ్యమైన చేప విత్తనాలు అందించేలా తగినన్ని చేపల ఉత్పత్తి కేంద్రాలను అందుబాటులోకి తెస్తాం. అవసరమైన చోట మార్కెట్లు నిర్మిస్తాం. అదేవిధంగా పాలమూరులోని ఐదు జిల్లాల పరిధిలో క్రీడాకారులకు తగిన క్రీడా వసతులు, స్టేడియాలు, అకాడమీలు సమకూర్చేలా పక్కా ప్రణాళికలు రూపొందించి.. పాలమూరును అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే అగ్రభాగాన నిలిచేలా నా వంతు కృషి చేస్తా. పాలమూరు బిడ్డ సీఎం రేవంత్ రెడ్డి ఆశయానికి అనుగుణంగా.. అందరు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్దే లక్ష్యంగా ముందుకుసాగుతా.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం..

కాంగ్రెస్ పార్టీని నమ్ముకుంటే ఎవరికీ అన్యాయం జరగదు. **కాంగ్రెస్‌**తోనే సామాజిక న్యాయం సాధ్యం. సామాన్యుడైన **నాకు ఎ**మ్మెల్యేగా అవకాశం ఇవ్వడం.. ఇప్పుడు మంత్రి పదవి **రావడమే** ఇందుకు ఉదాహరణ. సామాన్యుడిగా ఉండి **ఈ స్థా**యికి వచ్చా. హంగు ఆర్భాటాలు లేకుండా జీవించాల**న్నదే నా** కోరిక. భేషజాలకు పోకుండా మన వంతు ఎంత **చేయాలన్న**దే నాకు ముఖ్యం. నాకు భగవంతుడు ఇచ్చిన ఈ అవకాశాన్ని సంపూర్ణంగా వినియోగించుకుని.. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడుతా. ఈ మంత్రి పదవి నాకు రాలేదు. ఉమ్మడి జిల్లాకు వచ్చింది. మీ శ్రీహరికి ఎక్కడా కొమ్ములు రావు. రానివ్వను కూడా. మీ అందరి గొంతుకై పని చేస్తా.

మహిళల ఆధ్వర్యంలో జిల్లాకో పెట్రోల్ బంక్..

విద్యార్థులు, యువతీ యువకుల్లో నైపుణ్యాలను వెలికితీసి.. తగిన శిక్షణ ఇప్పించి.. వారు స్వయం ఉపాధి వైపు అడుగులు వేసేలా మహబూబ్‌నగర్ ఫస్ట్, నవరత్నాలు పేరిట ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్వీయ నిధులతో కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం. ఇలాంటి కార్యక్రమాలను ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించేలా కృషి చేస్తా. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పథకం మహిళల పేరునే అమలు చేస్తోంది. స్త్రీ శక్తితోనే సమాజ అభివృద్ధి సాధ్యం. పాలమూరు మహిళలు రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచేలా నా శాఖ నుంచి బాధ్యత తీసుకుంటా. నారాయణపేట జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ నడుస్తోంది. దీన్ని మన ముఖ్యమంత్రే ప్రారంభించారు. అలాగే రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసి.. వారు ఆర్థిక అభివృద్ధి సాధించేలా కృషి చేస్తా.

ప్రోత్సాహం ఏది..?

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వేధిస్తోన్న పీడీల కొరత



ధరూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

- క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నా.. విద్యార్థులకు ప్రోత్సాహం కరువు
- జిల్లాలోని 8 కళాశాలల్లో ఒక్క పీడీ లేని వైనం
- అడుగంటుతున్న క్రీడా ప్రమాణాలు

జిల్లా వివరాలిలా..

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	8	ప్రైవేట్ జూనియర్ కళాశాలలు	14
ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు	3		
ప్రభుత్వ పీజీ కళాశాల	1	వ్యాయామ అధ్యాపకులు	నిల్

గద్వాల టౌన్: విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులను ప్రోత్సహించాలని ప్రసంగాలు ఇచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులు.. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడా ప్రమాణాలు అడుగంటి పోతున్నాయి. క్రీడా రంగానికి అధికంగా నిధులు కేటాయిస్తున్నా.. ప్రభుత్వం డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో మాత్రం వ్యాయామ అధ్యాపకుల నియామకాలపై దృష్టి సారించడం లేదు. క్రీడలను చదువులో అంతర్భాగం చేసుకోవడమే కాకుండా పాఠ్యాంశాల్లో కూడా చేర్చాలని అటు ప్రభుత్వాలు, ఇటు క్రీడా పండితులు యోచిస్తున్నా అమలులో అడుగు ముందుకు పడలేదు.

ఒక్క వ్యాయామ అధ్యాపకుడూ లేడు..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వ్యాయామ అధ్యాపకుల నియామక ప్రక్రియ ఆగిపోవడంతో పీడీలు లేని కళాశాలల సంఖ్య రోజు రోజు రోజుకు పెరుగుతున్నాయి. జిల్లాలో మొత్తం 8 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఆరేళ్ల క్రితం వరకు మల్దకల్, మానవపాడు, అలంపూర్, ధరూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మాత్రమే వ్యాయామ అధ్యాపకుల పోస్టులకు మంజూరయ్యాయి. గతంలో ఆయా కళాశాలల్లో వ్యాయామ అధ్యాపకులు ఉన్నా.. క్రమంగా బదిలీలు, ఉద్యోగ విరమణతో ప్రస్తుతం ఒక్కరూ కూడా లేరు. ప్రభుత్వం ఖాళీలను సైతం భర్తీ చేయలేదు. ఆ తర్వాత గద్వాలలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల కళాశాల, అయిజ, గట్టు ప్రభుత్వ కళాశాలలకు వ్యాయామ అధ్యాపకులు పోస్టులు మంజూరయ్యాయి. పోస్టులు మంజూరైనప్పటి నుంచి ఈ కళాశాలలో పీడీల నియామకం జరగలేదు. ప్రస్తుతం జిల్లాలోని 8 ప్రభుత్వ కళాశాలల్లో వ్యాయామ అధ్యాపకులు లేకుండానే బోధన జరుగుతోంది. ప్రతిసారి కళాశాల స్థాయిలో పోటీల నిర్వహణపై జరుగుతున్నా.. సమావేశాలలో మన జిల్లా తరఫున ఒక్కరూ కూడా పాల్గొనడం లేదు. దీంతో జిల్లాలో నిర్వహించే కళాశాలల స్థాయి పోటీలు నిర్వహణ కలగా మారుతోందని, పూర్తిస్థాయిలో విద్యార్థులకు న్యాయం చేయలేకపోతున్నామని పలువురు అధ్యాపకులు పేర్కొన్నారు.

ప్రభుత్వానికి నివేదించాం

జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వ్యాయామ అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని ఇటీవల ఇంటర్ బోర్డుకు నివేదించాం. అందుకు ఇంటర్ బోర్డు సానుకూలంగా స్పందించింది. అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాత్కాలిక పద్ధతిపై వ్యాయామ ఉపాధ్యాయులను నియమించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

– హృదయరాజు, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి

నియామకాలు చేపట్టాలి

గత కొన్నేళ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు లేకపోవడం వలన క్రీడా ప్రమాణాలు తగ్గుతున్నాయి. పాఠశాల స్థాయిలో క్రీడల్లో ఎంతో రాణిస్తున్నా.. కళాశాలలకు వచ్చేసరికి ప్రోత్సాహం అందడంలేదు. క్రీడలు సైతం అంతంతమాత్రంగానే నిర్వహిస్తున్నారు. తక్షణమే జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీలను నియమించాలి.

– విజయ రాణి, ఇంటర్ విద్యార్థిని, గద్వాల

డిగ్రీ కళాశాలల్లో..

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనూ వ్యాయామ అధ్యాపక ఖాళీలు కొన్నేళ్ల నుంచి భర్తీ కావడం లేదు. జిల్లాలో ప్రభుత్వ పీజీ కళాశాలతో పాటు 3 ప్రభుత్వ డిగ్రీ, కళాశాలలు ఉన్నాయి. ఇందులో ఎంఏఎల్‌డీ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ డిగ్రీ కళాశాలలో మాత్రమే ఒక్క ఫిజికల్ డైరెక్టర్ పోస్టు మంజూరైంది. అయితే, పదేళ్లుగా ఫిజికల్ డైరెక్టర్ పోస్టు ఖాళీగా ఉండగా.. ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొస్తున్నారు. వందల సంఖ్యలో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నప్పటికి తర్ఫీదు ఇచ్చే పీడీ లేకుండా పోయారు. గద్వాలలోని ప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాల, శాంతినగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కలశాలలో వ్యాయామ అధ్యాపకుల కొరత ఉంది. డిగ్రీ కళాశాలల్లో వ్యాయామ అధ్యాపకులను నియమించి క్రీడలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ప్రైవేటు కళాశాలల్లోనూ అంతే..

క్రీడాకారులను తయారు చేయడం కోసం ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలల్లో తప్పక వ్యాయామ అధ్యాపకులు ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు జారీ చేసింది. లేనిపక్షంలో కళాశాల ప్రారంభానికి అనుమతి ఇవ్వవద్దని విద్యాశాఖ అధికారులు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. అయినప్పటికీ ప్రైవేటు కళాశాలల వారు వ్యాయామ అధ్యాపకులను నియమించలేదు. ఇదిలాఉండగా, ప్రభుత్వ పాఠశాలల్లో పీఈటీ, పీడీ పోస్టులను తరుచూ భర్తీ చేస్తున్నారు. క్రీడాకారులకు ప్రోత్సాహం లభిస్తోంది. ఏటా రాష్ట్ర, జాతీయ స్థాయలో క్రీడోత్సవాలను నిర్వహిస్తుండటంతో చాలామంది క్రీడాకారులు వెలుగులోకి వస్తున్నారు. అండర్–14, అండర్–17 విభాగంలో ఏటా పాలశాలల్లో క్రీడలు జరుగుతాయి. జిల్లా నుంచి ఏటా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారు. పాఠశాల విద్య పూర్తయిన తర్వాత ఈ విద్యార్థులు అండర్–19 విభాగంలో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నా.. వారికి శిక్షణ ఇవ్వడానికి వ్యాయామ అధ్యాపకులు లేరు. దీంతో పాఠశాల స్థాయి పోటీలతోనే సరిపుచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాలల నుంచి జూనియర్ కళాశాలల్లో చేరిన వారికి అక్కడ శిక్షణ ఇచ్చే వారు లేకపోవడంతో నిరాశే ఎదురవుతోంది.

పెద్దధన్వాడ రైతులకు బెయిల్ మంజూరు

గద్వాల క్రైం: జోగుళాంబ జిల్లాలోని రాజోళి మండలం పెద్ద ధన్వాడకు చెందిన 12 మంది రైతులకు జిల్లా న్యాయమూర్తి ప్రేమలత షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అమయాక రైతులపై ఫ్యాక్టరీ యాజమాన్యం పోలీసులచే అక్రమ కేసులు నమోదు చేశారని జిల్లా కోర్టులో మంగళవారం న్యాయవాదులు మదన్‌మోహన్‌రెడ్డి, శోభారాణి వాదనలు వినిపించారు. ఈ నెల 4న రాజోళి మండలం పెద్దధన్వాడ గ్రామంలో గాయత్రి రెన్యూవబుల్ ఆన్‌లైన్ ఇండస్ట్రీస్ కంపెనీ యాజమాన్యం ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేశారని, దాదాపు 11 గ్రామాలకు చెందిన రైతులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారని న్యాయవాదులు పేర్కొన్నారు. పంటల సాగుకు అనుకూలమైన భూములలో రైతులు ఏళ్లతరబడిగా వ్యవసాయం చేసి ఉపాధి పొందుతున్నారని వివరించారు. ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం వల్ల ఉపాధి కోల్పోవడంతోపాటు కాలుష్య వాతవారణంతో జన జీవనం ప్రమాదంలో పడుతుందని పేర్కొన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రైవేటు బౌన్సర్లను ఏర్పాటు చేసుకుని రైతులపై ప్రతిఘటించారని, ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అల్లర్లు చోటు చేసుకున్నాయని వివరించారు. దీంతో యాజమాన్యం ఉద్దేశపూర్వకంగా 42 మంది రైతులపై రాజోళి పోలీసుస్టేషన్‌లో అక్రమ కేసులు నమోదు చేయించారన్నారు. ఈ నెల 5న గద్వాల జూనియర్ సివిల్ జడ్జి ముందు పోలీసులు 12 మంది రైతులను హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించడంతో పోలీసులు జైలుకు తరలించారన్నారు. రైతులపై ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యం, సీఈఓ మంజునాథ్ ఉద్దేశపూర్వకంగా కేసులు నమోదు చేయించారని 20 నిమిషాల పాటు వాదనలు వినిపించారు. వాదనల అనంతరం జిల్లా న్యాయమూర్తి ప్రేమలత 12 మంది రైతులకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసినట్లు న్యాయవాదులు 'సాక్షి'కి చెప్పారు. ప్రస్తుతం కేసు కోర్టు పరిధిలో ఉందని, తుది వివరాలను త్వరలో వెల్లడిస్తామని న్యాయవాదులు తెలిపారు.

అంగన్‌వాడీల్లో మౌలిక వసతులు కల్పించండి



మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్

గద్వాల: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు సురక్షితంగా ఉండే విధంగా అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి అనితా రామచంద్రన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యలయంలో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు శుభ్రమైన వాతావరణంలో పూర్తిగా సురక్షితంగా ఉంచాలని, సొంత భవనం అద్దె భవనం అన్న తేడా లేకుండా నిర్మాణ లోపాలు పగుళ్ల ప్రమాదకరమైన పరిస్థితులు తేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదనపు కలెక్టర్ నర్సింగరావు, జిల్లా సంక్షేమ అధికారి సునంద తదితరులు ఉన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించండి

ఎర్రవల్లి: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ప్రతిరోజు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ అన్నారు. మంగళవారం మండల ంలోని కొండేరులో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ నర్సింగరావుతో కలిసి ఆమె సందర్శించి చిన్నారుల హాజరుశాతం పరిశీలించి పలు రికార్డులను తనిఖీ చేశారు. నిత్యం చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం గురించి ఆరా తీసి వారితో ముచ్చటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసి చిన్నారుల సంఖ్యను పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులకు బోధించే విద్యా ప్రమాణాల గురించి అడిగి తెలుసుకొని వాటిని కొంతమేరకు పెంచాలని సూచించారు. ప్రభుత్వం నుంచి అందించే నాణ్యమైన పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా చిన్నారులకు అందించి వారు ఆరోగ్యంగా ఎదిగేలా చూడాలన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులతో ముచ్చటించి గ్రామాలలో స్నేహ కమిటీలు నిర్వహిస్తున్న పనితీరును గురించి అడిగి తెలుసుకున్నారు. బాల్య వివాహాలను అరికట్టడం, మహిళలపై లైంగిక వేధింపుల వంటి అంశాలపై విద్యార్థినులతో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీడీ నర్సింములు, సిడిపీఓ సుజాత, ఎంపీడీఓ అబ్దుల్ సయ్యద్‌ఖాన్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయ్యమ్మ, ఏపీఎంలు కోటేశ్వరి, ఎల్లప్ప, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు, వైద్య సిబ్బంది, సీసీలు, వివోఏలు, తదితరులు పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్ల జారీ వేగవంతం చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

గద్వాల: జిల్లాలో సదరం సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, ప్రజకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంతోష్ వైద్య శాఖ అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో చేపట్టిన సదరం సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ స్లాట్ బుకింగ్ విధానం పెండింగ్ దరఖాస్తుల వివరాలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో విభాగాల వారీగా చేపట్టిన పనులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది స్లాట్‌లు బుక్ చేస్తున్నారు. దరఖాస్తులు చేసుకున్న వారి దరఖాస్తులను ఎంత మేరకు క్లియర్ చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఆర్థోపెడిక్ విభాగంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్లియర్ చేయాలని అన్నారు. వచ్చిన దరఖాస్తుల వివరాలను డిజిటల్‌గా నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఆసుపత్రి సూపరిడెంట్ డాక్టర్ ఇందిరా, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు పత్రాలు అందజేయడం జరుగుతుందని కలెక్టర్ సంతోష్ అన్నారు. మంగళవారం గద్వాల మండలం శెట్టి ఆత్మకూరులో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల రీవెరిఫికేషన్ నిర్వహించారు. గ్రామంలో మొత్తం 30 మందికి ఇళ్లు మంజూరవగా అందులో 11 మందికి అర్హతపై అనుమానం వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ స్వయంగా గ్రామాన్ని సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గృహాలు లేని నిరుపేదలకు అన్యాయం జరగకుండా రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు మేరకు మాత్రమే గృహాలు మంజూరయ్యేలా అధికారులు గ్రామాలలో ఎంపిక ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇల్లు కచ్చితంగా అర్హులకే దక్కాలని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి విడతల వారిగా రూ.5 లక్షల నిధులు అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడి కాశీనాద్, ఎఈ ప్రకాష్, తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

బావిలో పడి మహిళ మృతి



సరస్వతి (ఫైల్)

మల్దకల్ : బావిలో బట్టలు ఉతికేందుకు వెళ్లిన ఓ మహిళ ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడి మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని మద్దెలబండ గ్రామంలో మంగళవారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సరస్వతి (38) భర్త సవారన్న వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే వారు. సరస్వతి పొలం పనులు ముగించుకొని ఇంటికి వెళ్లే క్రమంలో బావిలో బట్టలు ఉతికేందుకు వెళ్లింది. ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడిపోవడంతో ఈత రాక నీటిలో మునిగి మృతి చెందింది. మహిళ మృతితో కుటుంబంతో పాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం



లింగంగౌడ్ (ఫైల్)

తాడూరు: వ్యవసాయ పొలానికి వెళ్తున్న ఓ రైతును గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో దుర్మరణం చెందాడు. ఈ ఘటన తాడూరు మండలం గుంతకోడూరు సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గుంతకోడూరుకు చెందిన లింగంగౌడ్ (45) తనకున్న పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. రోజు మాదిరిగానే ప్రధాన రహదారిపై నడుచుకుంటూ పొలానికి వెళ్తుండగా.. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాగం శశిధర్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

వ్యక్తి బలవన్మరణం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని నార్లాపూర్ చెంచుగూడెం గ్రామానికి చెందిన తిరుగుడు బక్కన్న (45) ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడు రోజుల క్రితం భార్య సాలమ్మతో మృతుడు బక్కన్న ఘర్షణ పడ్డాడు. దీంతో ఆమె తన సొంత గ్రామానికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాడుతో ఉరి వేసుకున్నాడు. సాయంత్రం కుమారుడు వచ్చి చూడగా అప్పటికే బక్కన్న మృతి చెందారని తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఘటనపూ ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వ్యక్తికి ఏడాది జైలుశిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: భార్యను వేధించిన కేసులో ఓ వ్యక్తికి న్యాయస్థానం మంగళవారం ఏడాది జైలు శిక్ష విధించింది. వివరాల్లోకి వెళితే నవాబ్‌పేట మండలం కారూర్‌కు చెందిన ఆటో డ్రైవర్ కావలి శ్రీనివాస్‌పై అతని భార్య తనను మానసికంగా శారీరకంగా వేధిస్తున్నాడని 2021లో మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఛార్జిషీట్‌ను కోర్టుకు సమర్పించారు. ఈ కేసు మంగళవారం వాదనకు రావడంతో వాదనలు విన్న మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు కావలి శ్రీనివాస్‌ను దోషిగా తేల్చి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధించింది. ఈ సందర్భంగా ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ మహిళలపై హింసకు పాల్పడితే పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి



మాగనూర్: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని వడ్వాట్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధితుడు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన రైతు వాకిటి చిన్న మారెప్పకు చెందిన ఎద్దు పొలంలో మేత మేయడానికి వెళ్లింది. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి వెళ్లగా కరెంట్ వైరు తగలడంతో అక్కడికక్కడే మరణించింది. మృతి చెందిన ఎద్దు విలువ రూ.60 ఉంటుందని ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

వ్యక్తిపై కేసు నమోదు

బిజినేపల్లి: బిజినేపల్లి నుంచి నాగర్‌కర్నూల్ వైపు ఆర్టీసీ బస్సులో వెళ్తున్న యువతితో అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిని షీటీం బృందం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు షీ టీం ఇన్‌చార్జ్ విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. నిందితుడిని వికారాబాద్‌కు చెందిన శివగా గుర్తించామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఈవ్ టీజింగ్ చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ రామేశ్వర్ హెచ్చరించారు.

పార్వతమ్మకు పోలీసుల ఆశ్రయం

- 'సాక్షి' కథనానికి స్పందన
- ఎస్పీ ఆదేశాలతో నిమ్స్‌కు తరలింపు
- భర్తను పిలిపించి కుమారులపై ఫిర్యాదు

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూర్: నవమాసాలు మోసి కనీ పెంచి ప్రయోజకుడిని చేసిన ఆ తల్లిని బస్టాండ్‌లో వదిలేసిన వెళ్లిన కసాయి కొడుకు.. హృదయవిధారక ఘటనకు సంబంధించి మంగళవారం 'సాక్షి'లో పట్నం వెళ్దామని.. ఆత్మకూర్‌లో దింపాడు.. కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి ఎస్పీ రావుల గిరిధర్ స్పందించి ఘటనపై ఆరాతీసి పార్వతమ్మకు ఆశ్రయం కల్పించాలని సీఐ శివకుమార్, ఎస్సై నరేందర్‌కు ఆదేశాలు జారీ చేశారు. సీఐ, ఎస్సై ఆత్మకూర్ బస్టాండ్‌కు చేరుకొని వృద్ధురాలితో వివరాలు సేకరించారు.

మెరుగైన వైద్యానికి ఎస్పీ సిఫారసు

ఆత్మకూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో దీనస్థితిలో ఉన్న పార్వతమ్మకు హైదరాబాద్‌లోని నిమ్స్‌లో మెరుగైన వైద్యం చేయించేందుకు ఎస్పీ గిరిధర్ అన్ని ఏర్పాట్లు చేయించారని సీఐ శివకుమార్, ఎస్సై నరేందర్ తెలిపారు. ఎస్పీ ఆదేశాలతో పార్వతమ్మ భర్త రామకృష్ణను పిలిపించామని.. కుమారులు భాస్కర్, రాములుపై వనపర్తి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయించామని తెలిపారు. పార్వతమ్మ ఆధార్ కార్డు ఇతర వివరాలను సేకరించి ఇక్కడి నుంచే అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలిస్తామని, తమ సిబ్బందిని వెంట పంపిస్తామని వెల్లడించారు.



ఆత్మకూర్ బస్టాండ్‌లో పార్వతమ్మతో మాట్లాడుతున్న సీఐ శివకుమార్, ఎస్సై నరేందర్



పట్నం వెళ్దామని.. ఆత్మకూర్‌లో దింపాడు

ఆలయ భూముల్లో అక్రమ నిర్మాణాలు తొలగిస్తాం



మట్లాడుతున్న దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ మదనేశ్వర్‌రెడ్డి

- దేవాదాయ, ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ మదనేశ్వర్‌రెడ్డి
- కొంత సమయం కావాలని అధికారులకు బాధితుల వినతి

చారకొండ: సీర్సనగండ్ల సీతారామచంద్రాస్వామి ఆలయానికి సంబంధించి సర్వే నెం 327, 328 భూమిలో గతంలో అక్రమంగా నిర్మించిన 34 ఇళ్లను హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఈనెల 19న తొలగిస్తామని దేవదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ మదనేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సీర్సనగండ్ల ఆలయ ఆవరణంలో గుట్ట దిగువన ఆలయ భూమిలో అక్రమ నిర్మాణాల తొలగింపుపై తహసీల్దార్ సునీత ఆధ్వర్యంలో బాధితులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆలయ భూమిలో ఇళ్లు నిర్మించుకున్న 34మందికి ఇళ్లు ఖాళీ చేయాలని గతంలో నోటీసులు అందించినట్లు తెలిపారు. గడువు మేరకు స్వచ్ఛందంగా ఇళ్లు ఖాళీ చేసి అధికారులు, దేవాదాయ శాఖకు సహకరించాలని కోరారు. దాంతో బాధితులు ఉన్నఫలంగా తమ నివాసాలను ఖాళీ చేసి వెళ్లిపోమంటే ఎక్కడికెళ్లాలి, కొన్ని ఏళ్లుగా ఇక్కడే ఉంటూ వివిధ పనులు చేసుకుంటూ ఇక్కడే జీవనం సాగిస్తున్నాం.. ఇళ్లను తొలగించొద్దని వేడుకున్నారు. అధికారులు ఖాళీ చేయాల్సిందేనని తెల్చడంతో ప్రత్యామ్నాయంగా మరోచోటు చూసుకునేవరకు కొంత సమయం ఇవ్వాలని కోరారు. రెవెన్యూ, దేవాదాయశాఖ అధికారులకు కొంత సమయం కావాలని వినతి పత్రం అంజేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు పేర్కొన్నారు. సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్ఐ శంషోద్దీన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వీణధరి, ఈఓ ఆంజనేయులు, ఆర్ఐ భరత్, అధికారులు ఉన్నారు.

అక్టోబర్‌లో నిర్వహించే పాలమూరు యూనివర్సిటీ స్నాతకోత్సవానికి రావాలని కోరుతూ రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ చాన్స్‌లర్ జిష్ణుదేవ్ వర్మను మంగళవారం పీయూ వీసీ శ్రీనివాస్ ఆహ్వానించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో గవర్నర్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి.. స్నాతకోత్సవానికి సంబంధించిన వివరాలను వివరించారు. వీసీ వెంట పీయూ రిజిస్ట్రార్ రమేశ్‌బాబు ఉన్నారు.

– మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్



అనుమానిత వ్యక్తులతో అప్రమత్తం



వనపర్తిలోని గాంధీనగర్ ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని పలు కాలనీలో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ వెంకటేశ్వరావు అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా డీఎస్పీ, సీఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ కాలనీలో మంగళవారం 11 మంది ఎస్ఐలు, 69 మంది పోలీస్ సిబ్బంది కలిసి సుమారు 200 ఇళ్లల్లో సోదాలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజల రక్షణతో పాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకోవడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. నేర రహిత గ్రామాలుగా చేయాలనే ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు తనిఖీలు చేస్తున్నామని స్పష్టం చేశారు. అదే విధంగా మాదక ద్రవ్యాలు, గంజాయి, పేలుడు పదార్థాల నిల్వ చేసినట్లు తెలిస్తే కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. పేపర్లు, నంబర్ ప్లేట్లు లేని 40 వాహనాలను సీజ్ చేసి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. సంబంధిత వాహనాల యజమానులు పత్రాలు చూపించి వాహనాలను తీసుకువెళ్లాలని సూచించారు. పాత వాహనాలు కొనేటప్పుడు అన్ని పత్రాలు సరిచూసుకోవాలన్నారు. సైబర్ నేరాల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి వాటిని అరికట్టాలని కోరారు. ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడానికి దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ హరిప్రసాద్, వివిధ పోలీస్‌స్టేషన్ల ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

జూరాలకు 20వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జలవిద్యుత్ కేంద్రంలో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గింది. సోమవారం 50వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. మంగళవారం రాత్రి 7.30 గంటల వరకు 20వేల క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో తగ్గినటుల్ పీజేపీ అధికారులు తెలిపారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 20,763 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా 1,500, కోయిల్‌సాగర్‌కు 315, ఆవిరి రూపంలో 67 క్యూసెక్కులతో కలిపి మొత్తం 22,645 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 8.010 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

శ్రీశైలానికి 25,175 క్యూసెక్కులు..

దోమలపెంట: జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలం జలాశయానికి 25,175 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రస్తుతం శ్రీశైలం డ్యాంలో నీటిమట్టం 844.2 అడుగుల వద్ద 68.5660 టీఎంసీల నీటి నిల్వ ఉంది. రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకెఎల్ఐకి 1,326 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 3.990 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేసి దిగువన సాగర్‌కు 8,714 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

రామన్‌పాడులో 1,017 అడుగులు..

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో 1,017 అడుగులకు నీటిమట్టం చేరింది. జూరాల ఎడమ, కుడి కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేయగా.. రామన్‌పాడు నుంచి కుడి, ఎడమ కాల్వలకు 12 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.

'బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు బకాయిలు చెల్లించాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దళిత, గిరిజన పేద పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచితంగా చదివేందుకు ప్రవేశపెట్టిన బెస్ట్ అవైలబుల్ పథకం కింద ఏటా రాష్ట్రంలో సుమారు 26 వేల మంది చదువుతున్నారని గిరిజన విద్యార్థి సేవా సంఘం (జీవీఎస్ఎస్) ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు రామావత్ రవి రాథోడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే రెండేళ్లు (2023–24, 2024–25) గా ఆయా పాఠశాలలకు ఫీజు కింద రూ.154 కోట్ల బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈసారి కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటికీ ఈనెల 20 వరకు తెరవబోమని నిర్వాహకులు చెబుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పచ్చి రొట్టతో ప్రయోజనాలు

పాడి-పంట

జిల్లా వ్యవసాయాధికారి, సక్రియానాయక్

అలంపూర్ : వరి సాగులో సేంద్రియ ఎరువులను సమపాళ్లలో అందించడంలో రైతులు విఫలమవుతున్నారు. దీంతో పంటల దిగుబడి తగ్గిపోతుంది. వర్షాకాలం ప్రారంభంకావడంతో పంటల సాగుకు రైతన్నలు సన్నద్ధం అవుతున్నారు. ఈ పరిస్థితుల్లో పచ్చి రొట్ట ఎరువుల వినియోగంతో అనేక ప్రయోజనాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్ పేర్కొంటున్నారు.

పచ్చి రొట్ట ఎరువులతో కలిగే లాభాలు

పచ్చి రొట్ట వినియోగం వలన ముఖ్యంగా భూమి గుల్ల బారుతుంది. అలాగే భూసారం కూడా పెరుగుతుంది. పొలానికి నీటిని, పోషక పదార్థాలను నిల్వ ఉంచుకొనే శక్తి పెరుగుతుంది. అలాగే మొక్కల వేర్లకు గాలి, నీరు పోషకాలు పుష్కలంగా అందుతాయి. జనుము, జీలుగలు, పెసర వంటి పంటలను పచ్చి రొట్ట విత్తనాలు, ఎరువులను తక్కువగా వినియోగించుకొనే సాగు చేయవచ్చు. భూమిలో ఆమ్ల, క్షార గుణాలను పెంపొందించుకోవచ్చు. మొక్కలకు సూక్ష్మ పోషకాల లోపాలు రాకుండా చూసుకోవడంతోపాటు పంట నాణ్యత, దిగుబడులు పెంచేందుకు పచ్చి రొట్ట మేలు చేస్తోంది. వీటి వలన చీడపీడల బెడద కూడా తగ్గుతుంది. పంటలో కలుపు మొక్కలను నివారించుకోవచ్చు. వర్షపు నీరు వృథాగా పోకుండా భూమిలో ఇంకేలా చేస్తోంది. పంటలకు మేలు చేసే అనేక రకాల సూక్ష్మ క్రిములు భూమిలో వృద్ధి చెందేందుకు దోహదపడుతుంది. పప్పు జాతి పచ్చి రొట్ట పైరు వలన భూమిలో నత్రజనిని స్థిరీకరించి భూసారం పెరుగుతుంది.



పొలంలో సాగు చేసిన జనుము

పచ్చి రొట్ట విత్తన ఎరువుల ఎంపిక

పచ్చి రొట్ట పైరు బాగా పెరిగి, ఆకులు ఎక్కువగా, కాండం వచ్చి మెత్తగా ఉండేలా చూసుకోవాలి. ముఖ్యంగా వీలైనంత వరకు లెగ్గింగ్ జాతి మొక్కలను పెంచడం వలన వేర్లపైనే నత్రజని బుడిపెల ద్వారా గాలిలోని నత్రజనిని స్థిరీకరిస్తాయి. ఇవి త్వరగా కుళ్లిపోయే ప్రభావం కలిగి ఉంటాయి. ఇవి అన్ని రకాల నేలలకు అనుకూలంగా ఉండటంతో నీటి ఎద్దడిని తట్టుకొని పెరుగుతాయి. పచ్చి రొట్ట పైర్ల వేర్లు భూమిలోకి చొచ్చుకొనిపోయే గుణం కలిగి ఉంటాయి. త్వరగా పెరిగి కలుపు మొక్కల పెరుగుదలను అరికట్టేందుకు ఉపయోగపడతాయి.

జీలుగ సాగు

పచ్చి రొట్ట ఎరువుల సాగు చేసుకుంటే భూమికి అవసరమైన సేంద్రియ పదార్థాల్ని అందిస్తాయి. వీటి వలన భూమిలో సూక్ష్మ జీవులు బాగా వృద్ధి చెందుతాయి. జీలుగలు ఎకరానికి 12 నుంచి 15 కిలోల విత్తనం కావాలి. పూత దశలో కోసినపుడు ఎకరానికి 5 నుంచి 6 టన్నుల పచ్చి రొట్ట ఎరువు వస్తోంది. ఒక టన్ను జీలుగ సాగులో ఐదు కిలోల నత్రజని, 1.5 కిలోల భాస్వరం, 4 కిలోల పొటాష్ వస్తుంది. చౌడు భూములకు బాగా పనికొస్తుంది.

జనుములు

ఎకరానికి 20 కిలోల విత్తనం కావాలి. పూత దశ కంటే పంట వేసిన 8 వారాల తర్వాత కోసినప్పుడు 6–8 టన్నుల పచ్చి రొట్ట వస్తోంది. ఒక టన్ను జనుములో నాలుగు కిలోల నత్రజని, ఒక కిలో భాస్వరం, మూడు కిలోల పొటాష్ ఉంటుంది.

పిల్లి పెసర సాగుతో..

ఎకరానికి 6 నుంచి 8 కిలోల విత్తనం వేసుకోవాలి. పూత దశలో 4 నుంచి 5 టన్నుల పచ్చి రొట్ట ఇస్తోంది. దీనిని పరిశుభ్రంగా కూడా వాడుకోవచ్చు. ఒక టన్ను పిల్లి పెసరలో 4 కిలోల నత్రజనిని, ఒక కిలో భాస్వరం, 3 కిలోల పొటాష్ లభిస్తోంది. రైతులు పచ్చి రొట్ట ఎరువుల విత్తనాలు చల్లుకొని భూముల్లో సేంద్రియ కర్బనం పెంపొందించుకోవాలి.

మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ కొత్వాల్ తదితరులు

- పశుసంవర్ధక, యువజన, క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి
- ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానం

స్టేషన్ మహబూబ్‌నగర్: మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలని పశుసంవర్ధక, యువజన, క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మహబూబ్‌నగర్ ఫస్ట్ నైపుణ్యాభివృద్ధి కేంద్రం, సెట్విన్ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికేట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే యెన్నం ఆలోచనతో మహబూబ్‌నగర్ ఫస్ట్ కింద సెట్విన్ ద్వారా మహిళలకు ఉపాధి శిక్షణ చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. సెట్విన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామన్నారు. శ్రీనివాస్‌రెడ్డి పదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేసిన 3డీ యానిమేటెడ్ పుస్తకాలను మార్గదర్శకంగా తీసుకొని మక్తల్ నియోజకవర్గంలోని విద్యార్థులకు అందజేయగా.. 62శాతం ఉన్న ఉత్తీర్ణత వందశాతం పెరిగినట్లు పేర్కొన్నారు.

మయూరీ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేస్తాం

మహిళలు తయారు చేసే ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడానికి మయూరీ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేస్తామని ఎమ్మెల్యే యెన్నం పేర్కొన్నారు. కలెక్టర్ విజయేందిరబోయి మాట్లాడుతూ.. జిల్లాను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం అనేక విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు మంత్రి, ఎమ్మెల్యే సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్‌రావు, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ చైర్మన్ నర్సింహారెడ్డి, ఆనంద్‌గౌడ్, ఎన్‌పీ. వెంకటేశ్, సురేందర్‌రెడ్డి, విజయ్‌కుమార్, వసంత, సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మీప్రసన్న, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారం కోసం వంద మెట్లు అయినా దిగుతా

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తామని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి అభివృద్ధి, యువజన, క్రీడా శాఖమంత్రి వాకిట శ్రీహరి అన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లైన్‌లో నిలబడ్డ ఆఖరి లబ్ధిదారుడికి ప్రయోజనం చేకూర్చడేమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. 2014 నుంచి 2018 జెడ్పీటీసీ ఉన్నప్పుడూ ఆ రోజుల్లో నాపై దాడి జరిగినా, ఐదేళ్లు ఇబ్బందులు పెట్టినా ప్రజల గొంతుకై పనిచేసినట్లు తెలిపారు. ఇటీవలే కేబినెట్ సమావేశంలో పాల్గొన్నానని, ఉమ్మడి జిల్లాలో శాఖకు సంబంధించి పూర్తిస్థాయిలో డాటాతో రావాలని సీఎం తనతో చెప్పడం జరిగిందన్నారు. ఎలాంటి బేషజాలకు పోకుండా సమస్య పరిష్కారం కోసం పది కాదు వంద మెట్లు అయినా దిగుతానని చెప్పారు. నాకు మంత్రిగా అవకాశం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని అన్నారు. సామాన్య కాంగ్రెస్ కార్యకర్త నుంచి వాకిట శ్రీహరి మంత్రి కావడం గర్వంగా ఉందన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి వర్గానికి సమన్యాయం చేయాలనే సంకల్పం సీఎంకు ఉందన్నారు. ముదిరాజ్ బిడ్డ శ్రీహరిని మంత్రిగా నియమించారని, ఆయనకు వచ్చిన శాఖలు మాములు శాఖ కాదన్నారు. యాదవులు, ముదిరాజ్‌లకు అభ్యున్నతికి పాటుపడే శాఖలు అని, రాష్ట్ర అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని, అందుకే ఈ శాఖను శ్రీహరికి ఇచ్చినట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్, గ్రామాల్లోని సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అధిక నిధులు తెచ్చి ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తారని ఆకాంక్షించారు.

సహకార బ్యాంకు ఖాతాదారులకు యూపీఐ సేవలు

డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుమతులతో త్వరలోనే జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఖాతాదారులకు యూపీఐ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మహాజన సభలో చైర్మన్ మాట్లాడారు. ఈ సంవత్సరం మార్చి 31 నాటికి బ్యాంకు డిపాజిట్లు రూ. 443 కోట్లకు చేరుకున్నాయని.. ఇప్పటి వరకు రూ. 685 కోట్ల స్వల్పకాలిక, రూ. 468 కోట్ల దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలు ఇచ్చామని వెల్లడించారు. అదే విధంగా వివిధ ప్రయోజనాల కోసం రైతులు, ఖాతాదారులకు వ్యవసాయేతర రుణాలు అందిస్తున్నామన్నారు. రుణ వసూళ్లలో ప్రగతిని కనబరుస్తూ.. ఆర్‌బీఐ నుంచి వీక్ బ్యాంకు స్టేటస్ తొలగిపోయేలా ఉద్యోగులు కృషి చేశారన్నారు. హన్వాడ రైతు సేవా సహకార సంఘాన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంగా డీసీసీబీకి అనుసంధానం చేస్తూ సర్వసభ్య సమావేశం ఆమోదం తెలిపిందని వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 2,200 కోట్ల బిజినెస్ టర్నోవర్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. కాగా, జీఓ 44 రద్దు కోసం కృషిచేసిన డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డిని సింగిల్‌విండో చైర్మన్లు భూపాల్‌రావు, భాస్కర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. సమావేశంలో వైస్ చైర్మన్ కోరమోని వెంకటయ్య, బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణ అధికారిణి జ్యోతిరాణి, డైరెక్టర్లు, పీఏసీఎస్‌ల చైర్మన్లు తదితరులు ఉన్నారు.

మిగిలిన కుట్టు కూలి ఎప్పుడిస్తారు?

- గత ఏడాదికి సంబంధించిన మిగతా డబ్బులు రూ.లక్షల్లో పెండింగ్‌లో ఉంచిన అధికారులు
- మెప్మా భవనం తలుపులు మూసివేసి నిరసన తెలిపిన మహిళా సంఘం సభ్యురాలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: 'గత ఏడాది విద్యా సంవత్సరం (2024–25) లో విద్యార్థుల కోసం యూనిఫాం కుడితే మొదటి విడత కుట్టు కూలి మాత్రమే ఇచ్చి, పెంచిన డబ్బులు ఇవ్వకపోతే ఎలా..?' అంటూ ఓ మహిళా సంఘం సభ్యురాలు ఏకంగా మెప్మా భవనం తలుపులు కొద్దిసేపు మూసివేసి నిరసన తెలిపిన ఘటన తాజాగా వెలుగులో వచ్చింది. గత ఏడాది మహబూబ్ నగర్, జడ్చర్ల, భూత్పూర్ మున్సిపాలిటీల పరిధిలోని సుమారు 140 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 18 వేల మంది విద్యార్థుల కోసం యూనిఫాం కుట్టడానికి మూడు ఏజెన్సీ (ఎస్‌హెచ్‌జీ)లకు మెప్మా అధికారులు పని అప్పగించారు. అప్పట్లో ఒక్కో జతకు రూ.50 మాత్రమే కూలి ఇస్తామనడంతో సరిపోదని ఏజెన్సీ నిర్వాహకులు మొరపెట్టుకున్నారు. దీంతో మరో రూ.25 చొప్పున అదనంగా ఇచ్చేందుకు అంగీకారం కుదిరింది. ఆ మేరకు పని పూర్తి చేసి అప్పగించినా ఇంకా రూ.తొమ్మిది లక్షల వరకు రావాల్సి ఉందని ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. విసిగి వేసారిన వారిలోని ఒకరు శ్రీనివాసకాలనీ మహిళా సంఘం సభ్యురాలు సాధామిని మంగళవారం మధ్యాహ్నం మెప్మా భవనానికి చేరుకుని సీఓలతో వాగ్వాదానికి దిగారు. వారిని బయటకు పంపి తలుపులు మూసివేసి కొద్దిసేపు నిరసన తెలిపారు. తమకు రావాల్సిన డబ్బులు వెంటనే చెల్లించాలని వేడుకున్నారు. చివరకు లెక్కలు తేల్చి త్వరలోనే ఇస్తామని వారు బదులివ్వడంతో ఆమె శాంతించి అక్కడి నుంచి వెనుదిగారు. ఈ విషయమై ఇన్‌చార్జ్ డీఎంసీ ఎం.లక్ష్మిని వివరణ కోరగా గత ఏడాదికి చెందిన సుమారు రూ.8.06 లక్షలకు చెక్కు ఇటీవలే డీఆర్‌డీఏ అధికారులు తమకు ఇచ్చారన్నారు. అయితే ఏజెన్సీ నిర్వాహకులు మాత్రం రూ.తొమ్మిది లక్షలు రావాల్సి ఉందని అడుగుతున్నారని.. లెక్కల్లో తేడా ఉన్నందున ఇంతవరకు చెల్లించలేదన్నారు. త్వరలోనే వారిని పిలిపించి లెక్కలు సరిచూసి నిబంధనల మేరకు బకాయిలు ఇస్తామన్నారు.